క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: ప్రభుత్వ పథకాలను సద్విని యోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. గురువారం ఆయన మండల పరిధిలోని గొల్లలదొడ్డి గ్రామ సచివాలయంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై సభ్యులు, రైతులు, వ్యవసాయ సిబ్బందితో చర్చించి రైతు భరోసా సంచికలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు, యంత్రాలను అందిస్తుందన్నారు. అవసరమైన రైతులు ఆర్బీకేలలో సంప్రదించాలన్నారు. సూక్ష్మ పోషకాతు జింక్, జిప్సం కూడా రాయితీపై ఇస్తామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పది పరీక్షలకు ఆరుగురు గైర్హాజరు

సి.బెళగల్: మండలంలో జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఆరు మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల నిర్వాహకులు తెలిపారు. గురువారం హిందీ పరీక్ష నిర్వహించగా కొత్తకోట జెడ్పీ హైస్కూల్‌లో ముగ్గురు, ఏపీ మోడల్ స్కూల్లో ఇద్దరు, సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్‌లో ఒక్కరు చొప్పున మొత్తం ఆరుగురు విద్యార్థులకు గైర్హాజరయ్యారని ఆయా పాఠశాల నిర్వహకులు రఘురామిరెడ్డి, వంశీమోహన్, సత్యనారాయణ, బలరాముడు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పంచాయతీ సిబ్బందికి సూచనలిస్తున్న డీపీఓ నాగరాజనాయుడు

కోడుమూరు రూరల్: పరిసరాలను ప్రతి రోజు శుభ్రం చేస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీఓ నాగరాజనాయుడు కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. గురువారం కోడుమూరులో డీపీఓ నాగరాజ నాయుడు పర్యటించి పన్నుల వసూళ్లు, శానిటేషన్, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లను, చలివేంద్రాన్ని పరిశీలించారు.పరిసరాలు శుభ్రంగా ఉంచాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ సురేష్ ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఆర్‌వీఎఫ్ నాయకులు

ఓర్వకల్లు: అర్హులందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ కోరారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా రెండో విడత జగనన్న ఇళ్ల పట్టాలను తక్షణమే మంజూరు చేయాలని తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎల్ జిల్లా అధ్యక్షులు రాజు, ఆర్‌వీఎఫ్ నాయకులు విక్రమ్, విష్ణు, రాజు, బాలకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'విధుల పట్ల ఇంత నిర్లక్ష్యమా'


రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

కర్నూలు(న్యూటౌన్): విధుల పట్ల ఇంత నిర్లక్ష్యం పనికిరాదని కర్నూలు మండల అధ్యక్షురాలు ధర్మవరం వెంకటేశ్వరమ్మ సచివాలయ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఉల్చాల గ్రామ సచివాలయం -1, 2 ను తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. సంతకాలు చేసి వెళ్లిపోయిన ఉద్యోగుల పేర్లను నోట్ చేసుకున్నారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డికి, కర్నూలు ఎంపీడీఓ భాస్కర్ నాయుడుకు ఫోన్ చేసి గైర్హాజరైన సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన సచివాలయ ఉద్యోగులే విధుల పట్ల ఇష్టానురీతిలో వ్యవహరిస్తుండటం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఉద్యోగాలిస్తే బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం సహించరానిదన్నారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు.

పేదోడి ఫ్రిజ్‌లకు భలే గిరాకీ

- వివిధ ఆకారాల్లో కుండలు, కూజాలు, మట్టి పాత్రలు
- ఎండాకాలం ప్రారంభంతో పెరిగిన విక్రయాలు


బూజునూరు గ్రామంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కుండలు, కూజాలు, మట్టి పాత్రలు

గడివేముల : ఎండలు దంచి కొడుతున్నాయి. ఉదయం పది తర్వాత ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు కొందరు ఇళ్లలో మట్టి కుండలను తెచ్చి పెట్టుకుంటున్నారు. కాస్త డబ్బున్న వాళ్ల కరెంట్ ఫ్రిజ్‌లు వాడుతుండగా.. పేదలకు మట్టి కుండలే ఫ్రిజ్‌లు. నీరు చల్లగా ఉండటంతో పాటు ఆరోగ్యానికి మంచిది కావడంతో ఎండా కాలంలో మట్టి కుండల విక్రయాలు ఊపందుకున్నాయి. విక్రయదారుల కూడా వివిధ ఆకారాలు, రంగుల్లో తయారు చేసి వినియోగదారులను ఆకట్టుకుంటున్నారు. గడివేముల మండల పరిధిలోని బూజునూరు, గని, గడివేముల, మంచాలకట్ట గ్రామాల్లో మట్టి కుండలు, కూజలు అమ్ముతున్నారు. సైజును బట్టి రూ.100 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు.

గిరాకీ ఉంది



మా కుటుంబ సభ్యులము దాదాపు 22 ఏళ్ల నుంచి కుండలు విక్రయిస్తూ జీవనగా సాగిస్తున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం కుండలు, కూజాల వ్యాపారం బాగానే ఉంది. కూజాలు సైజును బట్టిని రూ.100 నుంచి రూ.500 వరకు ఉన్నాయి. ఎండలు అధికం కావడంతో ప్రతి ఒక్కరూ కొనుగోలు చేస్తున్నారు. అన్ని రకాల మట్టి సామగ్రి అమ్ముతున్నాను. పండుగల సమయంలో మట్టి కుండలకు గిరాకీ ఉంటుంది.
– కుమ్మరి శివకృష్ణ, కుండల వ్యాపారి, బూజునూరు గ్రామం

కుండలో వండుకుని తింటున్నా



నా వయస్సు 66 ఏళ్లు. కట్టెల పొయ్యి మీద కుండలో వండుకున్న ఆహారాన్నే తింటున్నా. అన్ని కాలాల్లో కూజాల నీటినే తాగుతున్నా. దీని వల్ల రోగాలు దరిచేరలేదు. ఆరోగ్యంగా ఉన్నాను. వ్యాధినిరోధక శక్తి బాగా ఉంటుంది. చేతిపంప్(బోరింగ్ నీళ్లు తీసుకుని కుండలో పోసుకుని తాగుతున్నాం. మా కుటుంబసభ్యులకు ఎటువంటి అనారోగ్య సమస్యలూ లేవు.
– దస్తగిరి, గడివేముల గ్రామం


భక్తుల మధ్య సాగుతున్న రథోత్సవం

సుంకులాపరమేశ్వరీ.. పాహిమాం!

- రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు

గూడూరు రూరల్: కె.నాగలాపురంలోని గ్రామ దేవత సుంకులాపరమేశ్వరీదేవి రథోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి ఆలయ నిర్మాణ దాత రాజ్‌కుమార్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై కొలువుంచి ఆలయ నిర్మాణదాత రాజ్‌కుమార్, అలయ అధికారి దినేష్, ఎస్‌ఐ సోమ్లానాయక్, గ్రామపెద్దలు గోపాల్‌రెడ్డి, పత్తి మద్దిలేటిలు పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. స్థానిక గంగమ్మ గుడి వరకు భక్తులు రథాన్ని లాగి అక్కడి నుంచి యథాస్థానానికి చేర్చారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు రథోత్సవాన్ని వీక్షించి పరవశించిపోయారు.

కాడెడ్ల బలప్రదర్శన

సుంకులాపరమేశ్వరీదేవి జాతర సందర్భంగా పెంచికలపాడులో ఏర్పాటు చేసిన కాడెడ్ల బండలాగు పోటీలను ఎస్‌ఐ సోమ్లానాయక్ ప్రారంభాచారు. ఎనిమిది జతల కాడెడ్లు పాల్గొనగా కురువ సామద్ది వృషభాలు విజేతగా నిలిచాయి.రెండోస్థానంలో పెద్దమాదన్న, మూడవ సాథనంలో చిన్నసుంకన్న, నాలుగవ స్థానంలో రాముడు,ఐదవస్థానంలో కిషన్‌సింగ్ ఎడ్లు నిలిచాయి. వీరికి దాతలు మద్దిలేటి, కృష్ణ,గోపాల్, నాగసుంకన్న, లక్ష్మన్న, గౌండ ఖాజా, రామచంద్రుడు, గోరంట్ల, ఎంపీటీసీమద్దిలేటి నగదుబహుమతులు అందించారు.


అమ్మవారిని దర్శించుకున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

'ఫ్యామిలీ డాక్టర్'తో మెరుగైన వైద్యం


104 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: అవసరమైన ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌ను ప్రవేశ పెట్టారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కందికాపల్లె గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా 104 వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి ఇంటికి డాక్టర్ వచ్చి ఆరోగ్య సమస్యలపై ఆరా తీసి, అక్కడే చికిత్స అందిస్తారన్నారు. అవసరమైతే ప్రభుత్వ ఆస్పత్రులకు రెఫర్ చేస్తారన్నారు. నెలలో రెండు సార్లు 104 వాహనం గ్రామంలోకి వస్తుందన్నారు. వాహనంలో 69 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. 14 రకాల వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓపీ చూస్తారన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు డాక్టర్లు గ్రామాల్లో పర్యటించి మంచాన పడిన రోగులకు వైద్యం అందిస్తారన్నారు. ఇలాంటి వైద్య సేవలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. దేశ చరిత్రలో ఈ ప్రోగాం ఓ మైలురాయి అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, సర్పంచ్ రామచంద్రుడు, ఎంపీటీసీ సభ్యుడు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే డబుల్ ట్రాక్ పనులకు భూమి పూజ..

నంద్యాల నుంచి డోన్ వరకు నిర్మించనున్న రైల్వే డబుల్ ట్రాక్ పనులకు కొలూరు వద్ద ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి భూమి పూజ చేశారు. నెరవాడ రైల్వే గేటును పరిశీలించారు. అంతకు ముందు కందికాయపల్లెలో రైతులతో సమావేశమై గ్రీన్‌కో సోలార్ పరిశ్రమకు భూములు ఇచ్చే విషయమై చర్చించారు. ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగనివ్వమని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

'ఫ్యామిలీ డాక్టర్' దేశానికే ఆదర్శం


వెంకటగిరిలో అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్


పసుపులలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్

కోడుమూరు రూరల్/కర్నూలు (న్యూటౌన్): ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం దేశానికే ఆదర్శమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. గురువారం కోడుమూరు మండలం వెంకటగిరి, కర్నూలు మండలం పసుపుల గారమాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కా ర్యక్రమం ద్వారా మారుమూల గ్రామాల్లోని పేదల కు కూడా నాణ్యమైన వైద్యమందుతుందన్నారు. గ తంలో ఫ్యామిలీ డాక్టర్ అంటే కేవలం డబ్బున్న వాళ్ల కే ఉండేవారని, జగనన్న ప్రతి పేదవాడికి వైద్యాన్ని అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందుబాటులోకి తెచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకా లను చూసి ఓర్వలేక టీడీపీ నేతలు, ఎల్లో మీడియా అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో ఏ పథకం పొందాలన్న టీడీపీ నేతల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, జగనన్న గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజల దరికి చేర్చారన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా మరోసారి ఆశీర్వదించాలన్నారు. డీఐఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నెలకు రెండు సార్లు నిర్వహించి వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తామన్నారు. వెంకటగిరి కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి, తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీఓ చంద్రశేఖర్, లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి నస్రీన్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు యాదవ్, వైఎస్సార్‌సీపీ నేతలు మధుసూదన్‌రెడ్డి, గిడ్డయ్య, శివ, శ్రీనివాసులు, రాముడు, రామానాయుడు, మల్లేష్, పసుపుల కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ2 నెహేమ్యా, జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

గడివేముల: వైద్య ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేసేందుకు ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని వైద్యాధికారిణి డాక్టర్ మొల్లా జబీన్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని కొర్రపొలూరు, సోమాపురం గ్రామాల్లోని సచివాలయాల వద్ద ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. మంచానికే పరిమితమైన రోగులను ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని, రికార్డులను పరిశీలించారు.

పేద ప్రజలకు వరం

కల్లూరు: ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు పేద ప్రజలకు వరమని జిల్లా మలేరియా అధికారి నూకరాజు, ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఆనందరావు అన్నారు. గురువారం పెద్దటేకూరు గ్రామంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, జెడ్పీటీసీ ఎ.ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మునిస్వామి, పీహెచ్‌సీ వైద్యుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇకపై వైద్యం ఇంటి వద్దకే..

సి.బెళగల్: ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్య సిబ్బంది వచ్చి వైద్య సేవలు అందిస్తారని ఎంపీడీఓ రాముడు అన్నారు. గురువారం కొండాపురంలో సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ సునీత ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు శంకర్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

సుంకేసులకు నిలిచిన ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసులకు గురువారం ఇన్ ఫ్లో నిలిచిపోయింది.డ్యాంలో 0.990 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కేసీ కాల్వకు 817 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

నేడు ఉల్చాలలో 'జగనన్నే మా భవిష్యత్తు'

కర్నూలు(న్యూటౌన్): మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు... మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరవుతారని, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొనాలని ఆమె కోరారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్


లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): సంక్షేమ పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే సత్వరం పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి పాలనను ప్రజల వద్దకు తీసుకువచ్చారన్నారు. కులం, మతం, ప్రాంతం, వర్గం, చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. ఎన్నికల హామీలను 95 శాతం నెరవేర్చారని, రాబోయే 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలిచి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని కోరారు. కార్యక్రమంలో కర్నూలు మండల అధ్యక్షురాలు ధర్మవరం వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ2 నెహేమ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడి రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి


పల్లకీలో శ్రీవారి ఉత్సవ మూర్తులను కొండ దిగువకు తీసుకెళ్తున్న నిర్వాహకులు

సి.బెళగల్: మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో వెలసిన కోన వేంకటేశ్వర స్వామి రథోత్సవానికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మండల పరిధిలోని వివిధ గ్రామాల భక్తులు గురువారం ఫలహారాల బండ్లతో క్రిష్ణదొడ్డికి చేరుకుని స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. శుక్రవారం వేకువజామున స్వామి వారి రథోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరుకానుండటంతో అందుకు కావాల్సిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా గురువారం ఉదయం స్వామికి పల్లకీ సేవ నిర్వహించి ఉత్సవ మూర్తులను భక్తులు కొండపై ఉన్న ఆలయం వద్దకు చేర్చారు. మహాఘట్టాభిషేకం, పంచామృతాభిషేకం, సాయంత్రం రథాంగహోమం తర్వాత తిరిగి ఉత్సవ మూర్తులను కొండ దిగువకు చేర్చారు.


ఉత్సవానికి సిద్ధమైన కోన వేంకటేశ్వరుడి రథం

అవినీతి రహిత పాలన అందించాం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి అవినీతి రహిత పాలన అందించామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని కందికయపల్లె గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించి, సంక్షేమ బుక్‌లెట్‌ను అందించారు. రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రభుత్వ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. వారికి నచ్చిన వారికి, అంతో ఇంతో ముట్టజెప్పిన వారికి మాత్రమే సంక్షేమ ఫలాలు అందేవన్నారు. జగనన్న ప్రభుత్వంలో కులమతాలకు అతీతంగా, రాజకీయాలకు తావు లేకుండా అర్హులందరికీ వలంటీర్ల ద్వారా ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయన్నారు. ఇక గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ, గ్రావెల్, డ్రైనేజీలు, తాగు నీటి పైపులైన్‌లు, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ పథకాలు అందాలంటే ముఖ్యమంత్రిగా మరోసారి జగనన్ననే గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, సర్పంచ్ రామచంద్రుడు, ఎంపీటీసీ రమణయ్య, కోఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి పాల్గొన్నారు.

కోలుకోలేక యువతి మృతి

పాణ్యం: ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువతి కోలుకోలేక గురువారం మృతిచెందింది. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన భాస్కర్ కూతురు ఆకుల అంజలి(24) బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్స్‌గా పని చేస్తోంది. కాగా ఏడాది కాలంగా కడుపునొప్పితో బాధ పడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇటీవల ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు శాంతిరాం ఆసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందింది. యువతి తల్లి భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

15న మార్కెట్ దుకాణాలకు వేలంపాట

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు నూతనంగా నిర్మించిన 15 దుకాణాలకు ఈ నెల 15న వేలంపాట నిర్వహించనున్నట్లు మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు తెలిపారు. మార్కెట్ కమిటీ నిధులతో మార్కెట్ కమిటీ బయట పంప్‌హౌస్ రోడ్డులో ఒక చోట 7, మరో చోట 8 దుకాణాలతో వాణిజ్య సముదాయాలను నిర్మించినట్లు తెలిపారు. వీటిని వేలంపాట ద్వారా కేటాయిస్తామని తెలిపారు.

రసవత్తరంగా క్రీడాపోటీలు


వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న జట్లు

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో వెలసిన శ్రీగణమద్దిలేటిస్వామి తిరునాల సందర్భంగా గురువారం పలు క్రీడా పోటీలు రసవత్తరంగా సాగాయి. ముందుగా శ్రీగణమద్దిలేటి స్వామి వారికి, శ్రీలక్ష్మీ దేవికి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. సాయంత్రం ప్రభ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నెహ్రూ యువజన సంఘం ఆధ్వర్యంలో ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్, ఎద్దుల బండ లాగుడు పోటీలు(న్యూ కేటగిరీ), భజన పోటీలు, గుండు ఎత్తే పోటీలు నిర్వహించారు.

రమణీయం..రామ బంటు రథోత్సవం


జనసందోహం మధ్య సాగుతున్న పడమటి ఆంజనేయ స్వామి రథోత్సవం


పూజలందుకున్న ఆంజనేయస్వామి

సి.బెళగల్: మండల కేంద్రంలోని తెలుగు వీధిలో వెలసిన పడమటి ఆంజనేయ స్వామి మహా రథోత్సవం గురువారం కడు రమణీయంగా సాగింది. ఉదయం ఆలయంలో పండితులు పంచామృతాభిషేకం, పత్రపూజలు నిర్వహించారు. రథాంగ, రుద్రహోమాలు చేపట్టారు. నిర్వాహకులు బోనం కాగును మేళతాళాలతో స్వామి వారి రథం వద్దకు తెచ్చారు. సాయంత్రం స్వామి ఉత్సవ మూర్తిని రథంపై కొలువుంచి కొత్త బస్టాండ్ ఈశ్వరగుడి వరకు లాగారు. భక్తుల గోవింద నామస్మరణ, బాణ సంచా పేలుళ్లతో ఆ ప్రాంతం మార్మోగింది. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి రథోత్సవాన్ని తిలకించారు. అలాగే వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, టీడీపీ నాయకులు కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి తదితరులు రథోత్సవంలో పాల్గొన్నారు.